ప్రమాదపుటంచున పడవ ప్రయాణం

- నిబంధనలు పాటించని నిర్వాహకులు..
- కనీస జాగ్రత్తలు శూన్యం
- భయంభయంగానే పడవపై వెళ్తున్న ప్రయాణికులు
- ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన



ముక్త్యాల వద్ద కృష్ణానదిలో పడవపై రాకపోకలు సాగిస్తున్న ప్రజలు



ముక్త్యాల నుంచి మాదిపాడుకు వెళ్తున్న పడవ

ముక్త్యాల(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట మండలం ముక్త్యాల కృష్ణానది ఒడ్డు నుంచి అవతలి ఒడ్డు పల్నాడు జిల్లా మాదిపాడుకు సాగుతున్న పడవ ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. నిత్యం ఇరువైపులా కలిపి 30సార్లు ఈ పడవ ప్రయాణం సాగుతుండగా, పల్నాడు జిల్లాలోని మాదిపాడు, సత్తెనపల్లి ప్రాంతాలకు వెళ్లేందుకు దగ్గరగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రయాణికులు ఈ పడవ మార్గాన్నే ఎంచుకుంటున్నారు. అయితే పడవ నిర్వాహకులు ప్రయాణికుల సంరక్షణకు సంబంధించి కనీస జాగ్రత్తలు కూడా తీసుకోకపోతుండటంతో ప్రయాణం ప్రమాదభరితంగా మారింది.

వారాంతాల్లో మరింత రద్దీ..

పల్నాడు జిల్లా మాదిపాడు నుంచి జిల్లా చుట్టుపక్కల నరసరావుపేట, అచ్చంపేట, వినుకొండ ప్రాంతాల నుంచి ప్రజలు రోడ్డు మార్గాన రాకపోకలు సాగించాలంటే దూరాభారంతోపాటు సమయం కూడా ఎక్కువ పడుతుండటంతో కొందరు ఈ పడవ ప్రయాణానికి మొగ్గుచూపుతున్నారు. ఆ ప్రాంతంలో పుణ్యక్షేత్రాలుండటంతో శుక్ర, ఆదివారాల్లో భారీసంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ఒడ్డు నుంచి అవతలి ఒడ్డుకు ఒక్కో ప్రయాణికునికి రూ.50.. వాహనానికి రూ.150 వసూలు చేస్తున్నారు. నిత్యం 200మంది నుంచి 300మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా, శని, ఆదివారాల్లో ఆసంఖ్య మరింత అధికంగా ఉంటోంది.

కనీస రక్షణ చర్యలు కరువు..

పడవలో ఎక్కే ప్రయాణికుల రక్షణకు సంబంధించి నిర్వాహకులు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. నదీ ప్రవాహం ఏ సమయంలో ఎలా ఉంటుందో కూడా తెలియని పరిస్థితుల్లో ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు కూడా ఇవ్వడం లేదు. అంతే కాకుండా కొన్ని సమయాల్లో పరిమితికి మించి ప్రయాణికులతో ఈ పడవ రాకపోకలు సాగిస్తోంది. ఒడ్డుకు చేరుకున్న తరువాత అక్కడ దిగేందుకు కూడా సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రయాణికులు మోకాలిలోతు నీటిలో దిగిరాక తప్పని పరిస్థితి నెలకొంది. సమీపంలోనే పులిచింతల ప్రాజెక్టు ఉండటంతోపాటు ఉత్తరవాహినిగా నది ప్రవహిస్తుండటంతో కొన్నిసార్లు నీటి ప్రవాహ ఉధృతి హెచ్చుతగ్గులుగా ఉంటున్న సమయంలో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

అన్ని అనుమతులు లేకుండానే..

నదిలో పడవ రాకపోకలు సాగించాలంటే పోలీస్, మత్స్యశాఖ, అగ్నిమాపక, రెవెన్యూ శాఖలకు నుంచి ప్రత్యేక అనుమతులు తీసుకోవాలి. అయితే ఈ పడవ నిర్వాహకులు మాత్రం పల్నాడు జిల్లా కలెక్టర్ నుంచి అన్ని అనుమతులు తీసుకున్నామని చెబుతుండటం గమనార్హం. పడవలో ప్రయాణించే వారికి లైఫ్ జాకెట్లు, ప్రయాణికులను భద్రతకు సంబంధించి తగిన సిబ్బంది ఉండాల్సినప్పటికీ అటువంటి చర్యలేవి తీసుకున్న దాఖలాలు కనిపించడంలేదు. పడవలో కేవలం ఇద్దరు మాత్రమే ఉంటారు. ఈ పడవ రాకపోకలపై నిర్వాహకులు, ముక్త్యాల గ్రామస్తులకు ఇటీవల స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. ఈ వివాదం ఇటు ఎన్టీఆర్ జిల్లా, అటు పల్నాడు జిల్లాకు చెందిన అధికారపార్టీ ప్రజాప్రతినిధుల వద్దకు పంచాయతీకి దారి తీయగా వారు సర్దుబాటు చేసినట్లు సమాచారం. ఇలా రాజకీయనాయకుల మద్దతుతో ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే పడవ రాకపోకలు చేపట్టారని ముక్త్యాల వాసులు ఆరోపిస్తుండటం గమనార్హం. ఇకనైనా పడవ నిర్వాహకులు ప్రయాణికుల భద్రత కోసం తగిన ఏర్పాట్లు చేసేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పేటలో ఫ్లెక్సీల తొలగింపు



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేటను పోస్టర్లు, ఫ్లెక్సీలు లేని పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని అన్ని రకాల ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్ల తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. టీడీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను ఎమ్మెల్యే తాతయ్య స్వయంగా తొలగించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ఫ్లెక్సీలు, పోస్టర్లు, బ్యానర్లను అధికంగా ఏర్పాటు చేస్తుండటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందిపడుతున్నారన్నారు. కేవలం దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, పోస్టర్లు మాత్రమే ఉంచుతున్నామని, అవి కూడా దీపావళి తరువాత తొలగిస్తామని స్పష్టంచేశారు. పట్టణ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నేతలంతా మున్సిపాలిటీ వారికి సహకరించాలని కోరారు. ఇకనుంచి ఎవరైనా మున్సిపాలిటీ అనుమతి తీసుకున్న మీదటే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెండు మూడు రోజుల తర్వాత వెంటనే వాటిని తొలగించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపులు దక్కింది వీరికే



విజయవాడలో మద్యంషాపులకు లాటరీ తీసే కార్యక్రమానికి క్యూకట్టిన దరఖాస్తుదారులు



లాటరీ విధానాన్ని వివరిస్తున్న ఎక్సైజ్ అధికారి

కంచికచర్ల /నందిగామటౌన్ /జగ్గయ్యపేట/ పెనుగంచిప్రోలు: జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని 33మద్యం షాపులను రాష్ట్రప్రభుత్వం లాటరీ విధానం ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించింది. ఆయా మద్యంషాపుల నిర్వాహకుల ఎంపికను సోమవారం విజయవాడలో లాటరీ పద్ధతిలో చేపట్టారు. నందిగామ ఎక్సైజ్ స్టేషన్‌పరిధిలో 16మద్యం షాపులకు 906 దరఖాస్తులు రాగా, జగ్గయ్యపేట పరిధిలో పది షాపులకు 712 దరఖాస్తులు, కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఏడు షాపులకు 315 దరఖాస్తులు వచ్చాయి. ఈ రెండు నియోజకవర్గాల్లోని మూడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 33 మద్యం షాపులకుగాను 2033మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో అత్యధికంగా జగ్గయ్యపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోగల వత్సవాయి మండలంలోని 96వ నంబరు మద్యం షాపునకు 132 దరఖాస్తులు రాగా, 97వ నంబరు షాపునకు 120 మంది దరఖాస్తు చేసుకున్నారు.

షాపులు దక్కించుకున్నవారి వివరాలు..

కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో కలపి మొత్త ఏడు మద్యంషాపులు ఉన్నాయి. కంచికచర్లలోని 65వ నంబరు మద్యంషాపును కె.చంద్రశేఖర్, 66వ షాపును కె.ఫణికుమార్, 67వ షాపును తాతినేని భారతి, 68వ షాపును కె.శ్రీనివాసరావు, 69వ షాపును ఎం.వరప్రసాద్ లాటరీ ద్వారా దక్కించుకున్నారు. వీరులపాడు మండలంలోని 70వ నంబరు షాపును కె.రాజశేఖర్‌రెడ్డి, 71వ నంబరు షాపును వడ్డెంపూడి చంద్రశేఖర్ కైవసం చేసుకున్నారు.

నందిగామ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో..

నందిగామ పట్టణంలోని 72వ నంబరు మద్యం షాపును ఆర్.జానయ్య, 73వ షాపును ఏ.దిలీప్ కుమార్, 74వ షాపును డి.శ్యాంప్రసాద్, 75వ షాపును ఎం.చంద్రశేఖరరావు, 76వ షాపును వి.శ్రీనివాస్, 77వ షాపును కె.వెంకటేశ్వరరావు, నందిగామ మండలంలోని 78వ షాపును కె.రామచంద్రరావు, 79వ నంబర్ షాపును కొట్టే రామారావు దక్కించుకున్నట్లు సీఐ బంగారాజు తెలిపారు. పెనుగంచిప్రోలు మండలంలోని ఐదు మద్యం షాపులకుగాను 80వ నంబరు షాపును నలమోలు రామకృష్ణ, 81వ నంబర్ షాపును చల్లపల్లి రాజు, 82వ నంబర్ షాపును ఏ.వెంకటేశ్వర్లు, 83వ నంబరు షాపును గొల్లపూడి సాయిరాం, 84వ నంబరు షాపును మారయ్య లాటరీ ద్వారా పొందారు. మొత్తం ఐదు షాపుల్లో రెండింటిని తెలంగాణ ప్రాంతం వారు దక్కించుకున్నారు. చందర్లపాడు మండలంలోని 85వ షాపును జి.లక్ష్మీనారాయణ, 86వ షాపును కె.వెంకట్రావ్, 87వ షాపును డి.శ్రీనివాస్ దక్కించుకున్నారు.

జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలో..

జగ్గయ్యపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 88వ నంబరు షాపును షేర్‌మహ్మద్‌పేటకు చెందిన గాలిబ్ సైదా, 89వ షాపును తెలంగాణాలోని మర్రిపాడుకు చెందిన గారేపల్లి కాంతారావు లాటరీ ద్వారా దక్కించుకున్నారు. 90వ షాపును జగ్గయ్యపేటకు చెందిన వీర గోపి, 91వ షాపును చిల్లకల్లుకు చెందిన షేక్ మహ్మద్, 92వ షాపును తెలంగాణ రాష్ట్రం మునగాలకు చెందిన హిమబిందు, 93వ షాపును షేర్‌మహ్మద్‌పేటకు చెందిన బింగి లక్ష్మీనారాయణ, 94వ షాపును జగ్గయ్యపేటకు చెందిన తుమ్మేపల్లి శ్రీరాంచంద్రగుప్తా, 95వ షాపుకు బండిపాలెనకు చెందిన అడుసుమల్లి నరసింహారావు దక్కించుకున్నారు. అదేవిధంగా జిల్లాలోనే అత్యధిక దరఖాస్తులు అందిన వత్సవాయి మండలంలోని 96వనంబరు షాపును తెలంగాణ రాష్ట్రం ఖానాపురంనకు చెందిన చెరుకుమల్లి సత్యనారాయణ దక్కించుకోగా, 97వనంబరు షాపును సూర్యాపేటకు చెందిన బండి అనూష కైవసం చేసుకున్నారు. సర్కిల్ పరిధిలోని పది షాపుల్లో నాలుగింటిని తెలంగాణకు చెందినవారు దక్కించుకోవడం గమనార్హం.

మొద్దునిద్రలో అధికారులు

- ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసినా ఉదాసీన వైఖరి
- అనుమానాలకు తావిస్తున్న అధికారుల తీరు
- పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కాంద్రపాడులో ట్రాక్టర్‌తో దున్నడంతో ధ్వంసమైన జగనన్న లేఅవుట్‌లోని రోడ్డు (ఫైల్)

చందర్లపాడు(నందిగామటౌన్): చందర్లపాడు మండలంలో అధికారపార్టీ నేతలకు ఓ న్యాయం ..సామాన్యులకు ఓ న్యాయం అన్నట్లుగా తయారైంది పరిస్థితి. పేదలు ఎవరైనా ఇంటిజాగా కోసం ఖాళీగా ఉన్న రెండు సెంట్ల ప్రభుత్వ భూమిలో పూరిగుడిసె వేసుకుంటే నిబంధనల పేరుతో ఆగమేఘాల మీద వారిని ఖాళీచేయించేందుకు యత్నించే రెవెన్యూశాఖ అధికారులు, మండలంలోని కాంద్రపాడులో ప్రభుత్వ లేఅవుట్లలోని రోడ్డును అధికార బీజేపీ నాయకులు ధ్వంసం చేసి కబ్జాకు పాల్పడుతున్నప్పటికీ ఆవైపు కనీసం కన్నెత్తి చూడకపోతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈనెల రెండో తేదీన బీజేపీ నాయకులు దూలం కోటమ్మ, దూలం గోపిరెడ్డి, దండా అవినాష్ రెడ్డి, గోటిక శివకృష్ణారెడ్డి కలిసి ప్రభుత్వ లేఅవుట్‌లోని రోడ్లను ట్రాక్టర్‌తో ధ్వంసం చేయడంతోపాటు మంచి నీటి పైపులైన్, తాగునీటి ట్యాంకులను ధ్వంసం చేస్తుంటే స్థానికంగా నివాసముంటున్న కుంటుమద్ది పుష్పలత అడ్డుకుంది. దీంతో ఆగ్రహించిన కూటమి నేతలు సదరు మహిళపై దుర్భాషలాడటంతోపాటు ఇల్లు ఖాళీ చేసి వెళ్లాలని లేకుంటే ఇంటిని జేసీబీతో కూల్చివేయడంతోపాటు చంపేస్తామంటూ ఆమెను బెదిరించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించినా పోలీసుల్లో చలనం కరువైంది. ఈ జగనన్న లేఅవుట్ స్థలంలో రెండు కుటుంబాలవారు ఇళ్లు నిర్మించున్నారు. మిగిలిన పేదలు కూడా ఇళ్లు నిర్మించుకునేందుకు యత్నిస్తుండగా సదరు భూమి తమదంటూ పైనలుగురు వ్యక్తులు కోర్టును ఆశ్రయించడంతో ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉంది. ఈ క్రమంలోనే పైనలుగురు వ్యక్తులు పదిరోజుల కిందట ఆభూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తూ స్థానికులను భయభ్రాంతులను గురిచేస్తున్న వైనంపై అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోకపోతుండటంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఓమహిళ తనపై దాడికి పాల్పడున్నారంటూ ఫిర్యాదు చేసినప్పటికీ అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోలేని నిస్సహాయస్థితిలో పోలీసు వ్యవస్థ కొట్టుమిట్టాడుతోందని ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పేదలకు అందించిన స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడటంతోపాటు మహిళపై దాడికి పాల్పడిన ఆ నలుగురిపై చర్యలు తీసుకోవాలని కాంద్రపాడు గ్రామస్తులు కోరుతున్నారు.



చిల్లకల్లులో గ్రామోత్సవంలో భక్తుల సందడి

అమ్మవారికి గ్రామోత్సవం



చిల్లకల్లులో హంస వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రధాన సెంటరులో ఏర్పాటు చేసిన దుర్గమ్మ అమ్మవారికి సోమవారం హంస వాహనంపై గ్రామస్తులు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనంపై హంస అలంకరణ చేసి గ్రామంలోని పలు వీధుల్లో గ్రామోత్సవం చేశారు. అనంతరం అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి వేదాద్రిలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే



కంచికచర్లలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

కంచికచర్ల(వీరులపాడు): గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా కంచికచర్ల పట్టణంలో రూ.కోటితో చేపడుతున్న అభివృద్ధి పనులను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తంబళ్లపల్లి రమాదేవితో కలిసి సోమవారం ఆమె శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నియోజకవర్గానికి రూ.20కోట్లు మంజూరయ్యాయని, ప్రాధాన్యతక్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల సునీత, కోగంటి బాబు, నన్నపనేని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి



షేర్‌మహ్మద్‌పేటలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామాలభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట మండలం షేర్‌మహ్మద్‌పేటలో రూ. 70 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణాలకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ ఆగస్టు నెలలో అన్ని గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన పనులను తీర్మానాల ద్వారా ప్రభుత్వానికి నివేదిక అందించామన్నారు. దీంతో గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైన్‌లతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని వివరించారు. జగ్గయ్యపేట నియోజకవర్గానికి రూ. 17 కోట్లు నిధులు మంజూరయ్యాయని, ఈనిధులతో గ్రామాభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. సంక్రాంతి నాటికి పనులు పూర్తయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గౌరవరంలో రూ. 50 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారావు, కమలేష్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు నందిగామ మండల పరిషత్ సమావేశం

నందిగామటౌన్: ఎంపీపీ ఆకుల హనుమంతరావు అధ్యక్షతన మంగళవారం నందిగామ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే ఈసమావేశానికి సభ్యులంతా హాజరుకావాలని కోరారు. ఆయాశాఖల అధికారులు పూర్తిసమాచారంతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

రేపు వీరులపాడులో...

వీరులపాడు: ఎంపీపీ కోటేరు లక్ష్మి అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అరుంధతీదేవి తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

కంట్రోల్ రూం ఏర్పాటు



నందిగామటౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు ప్రకటించిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు నందిగామ మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ రమణ బాబు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నందున నందిగామ పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దన్నారు. విద్యుత్ స్తంభాలను తాకకుండా ఉండాలన్నారు. ముఖ్యంగా ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ప్రజలకు వేగవంతమైన సహాయక చర్యలు అందించేందుకు వీలుగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

కంచికచర్ల(వీరులపాడు): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చెవిటికల్లుకు చెందిన టీడీపీ నాయకుడు కోగంటి విష్ణువర్ధన్ మృతదేహాన్ని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచిగా విష్ణువర్ధన్ చెవిటికల్లు గ్రామాభివృద్ధికి విశేషసేవలు అందించారని కొనియాడారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ప్రమాదకరంగా వాగు చప్టా



కొణకంచి(పెనుగంచిప్రోలు): మండల పరిధిలోని జాతీయ రహదారిపై కొణకంచి క్రాస్‌రోడ్స్ నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారి మధ్యలో వాగుపై చప్టా అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇటీవల సంభవించిన వరదలకు చప్టా మొత్తం ఓవైపు కొట్టుకుపోయింది. మధ్యలో పెద్ద గుంతలు పడ్డాయి. తాత్కాలికంగా స్టాప్ బోర్డులు అడ్డం పెట్టారు. తక్షణం గుంతలు పూడ్చడంతోపాటు చప్టాకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వత్సవాయి మండలం మాచినేనిపాలెం గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, యూత్ సభ్యులు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా)ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా చిన్నాకు వారు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా ఇంటూరి చిన్నా మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని వారికి సూచించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలని, త ద్వారా గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని కోరారు.

క్లుప్తంగా

గుంతలను పూడ్చరూ...



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణం నుంచి బలుసుపాడు వెళ్లే తారురోడ్డుపై పలుచోట్ల ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. దీంతో పలువురు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. బలుసుపాడు, అన్నవరం, బూదవాడ, రెడ్డినాయక్ తండా, అన్నవరం మీదుగా బ్రిడ్జి మీదుగా తెలంగాణలోకి, బలుసుపాడు నుంచి 65వ జాతీయ రహదారి మీదుగా అనుమంచిపల్లి కాలనీ, గరికపాడు, తక్కెళ్లపాడు వరకు నిత్య వాహనచోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. పట్టణ శివారులోని గ్యాస్ కంపెనీ, పామాయిల్ తోట ప్రాంతాల్లో పడిన ఈ గుంతల కారణంగా తరచూ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. ఇకనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఆయాచోట్ల పడిన గుంతలను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఘనంగా అమ్మవారి నిమజ్జన ఊరేగింపులు



పెనుగంచిప్రోలు: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా పూజలందుకున్న అమ్మవార్ల విగ్రహ నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలను సోమవారం పెనుగంచిప్రోలులో ఘనంగా నిర్వహించారు. తూర్పు బజారులోని వినాయకుడి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన విగ్రహంతోపాటు శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని మేళతాళాలు, భక్తుల కోలాట నృత్యాల మధ్య గ్రామంలో ఊరేగించారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పెనుగంచిప్రోలు: మండలంలో మునేరు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు పెనుగంచిప్రోలు ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ సోమవారం తెలిపారు. అనిగండ్లపాడు రీచ్ నుంచి ఇసుక రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్, వెంకటాపురం రీచ్ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. అనంతరం ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించగా ఇసుకను అన్‌లోడ్ చేయించడంతోపాటు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేలు జరిమానా విధించారని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

రోడ్లకు మర్మమతులు చేపట్టాలని డిమాండ్



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): ఇటీవల సంభవించిన వరదలకు జగ్గయ్యపేట మండలం షేర్‌మహ్మద్‌పేటలో దెబ్బతిన్న రోడ్లకు ప్రభుత్వం వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి నాగమణి డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆమె షేర్‌మహ్మద్‌పేటలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ఈసందర్భంగా నాగమణి మాట్లాడుతూ నెల రోజులవుతున్నా రహదారులకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు. వరదలకు నియోజకవర్గంలోని రహదారులు, పంట పొలాలు, చెరువులు కూడా దెబ్బతిని ప్రజలు తీవ్రంగా నష్టపోయినప్పటికీ అధికారులు మాత్రం కనీసం స్పందించటం లేదని ఆరోపించారచు. ఇప్పటికైనా ప్రభుత్వం దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట సీపీఎం నాయకులు లింగారావు, గౌస్‌మియా, రవికుమార్, శ్రీనివాస్ ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో మాలధారణ



వీరులపాడు: కంచికచర్ల సమీపంలోని శివసాయి క్షేత్రంలో ఉన్న అయ్యప్ప ఆలయంలో పలువురు భక్తులు సోమవారం అయ్యప్ప మాలధారణ చేశారు. ఆలయంలోని కేరళ గురుస్వామి పద్మనాభ నంబూద్రి పప్పాస్వామి వీరికి మాలధారణ చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.